

# పుస్తక పరిచయం




**కవితల్లో** మినీ కవితలు, హైకూలు, నానీలు, నానోలు..ఇలా ఎన్ని ప్రక్రియలున్నాయో కథారచనలో కూడా నవలలు, కథలు, కథానికలు, మినీ కథలు ఇలా..వివిధ ప్రక్రియలు గత 3-4 దశాబ్దాల్లో వచ్చాయి. రచనా విస్తరణ ఎక్కువగా ఉన్నంతకాలం రచయిత చెప్పదలుచుకున్నది వివరించడానికి చాలా వెసులుబాటు ఉంటుంది. ఐతే నిడివి తక్కువలో పాఠకుడ్ని ఆకర్షించేలా వ్రాయడం కత్తిమీద సాము లాంటిదే ఆ కోవకి చెందినవే మినీ కథలు. మొత్తం కథ అంతా కలిసి ఒక పేజీలోనో మహా ఐతే రెండు పేజీల్లోనో పూర్తవాలి. అంతలోనే రచనా ఫలం సిద్ధించాలి. ఇదొక సర్కస్ లాంటిదే ఇలాంటి ప్రక్రియని ఔపోసన పట్టిన రచయిత శ్రీ కె.బి.కృష్ణ. గత 31 సంవత్సరాలుగా తెలుగు సాహితీ రంగంలో తనకంటూ ఒక శైలిని, మార్గాన్నీ ఏర్పరచుకున్న కృష్ణగారు వ్రాసిన 101 మినీ కథల సంపుటి ఈ ‘ అభిషేకం ‘ పుస్తకం. ఈ రచయితే లోగడ 51 మినీ కథలతో ఒక సంపుటి ప్రచురించి వార్తల్లోకి ఎక్కారు. ఈ 101 మినీ కథల సంకలనం కూడ మరొక రికార్డే. ఇందులోని మినీ కథలన్నీ ఏదో ఒక పత్రికలో ప్రచురితమైనవే కావడం గమనార్హం. వీటిల్లో శైలీ సంక్లిష్టత ఉండదు, అర్థం చేసుకోడానికి పెద్దగా ఆలోచించాల్సిన అవసరమూ లేదు. అలవోకగా, సరళంగా, సూటిగా సాగే ఈ మినీ కథల్ని ఎక్కడైనా మొదలుపెట్టి చదువుకోవచ్చు. కృష్ణగారి కలంలో అతి సాధారణమైన సంఘటనలు కూడా మినీ కథల రూపం ధరించాయి. మామూలు సంభాషణో. ఒక చెణుకో, ఒక హాస్య ప్రసంగమో..మినీ కథా రూపంలో మన ముందుకి తీసుకురాగల ప్రతిభ కె.బి.కృష్ణగారి సొంతం. ఈ మినీ కథలకి శీర్షిక నిర్ణయించడం కూడ ఒక సవాలే. ఇందులోనూ రచయిత ప్రతిభ సుస్పష్టంగా కనిపిస్తుంది. ‘ఆరో ఆడపిల్ల‘,‘ ఏమని చెప్పాలి‘,‘ కత్తిపూడి జంక్షన్‘,‘ కాంచనమాల‘,‘ అభిషేకం‘,‘ ఈ బాంబు వద్దురా కన్నా‘..ఇలా ఆసక్తికరమైన శీర్షికలతో ఈ మినీ కథలు పాఠకులని ఇట్టే ఆకర్షిస్తాయి. ఈ రచయిత కలం నుంచి కేవలం కాలక్షేపం కోసమే కాక కొంచెం ప్రయోజనకారిగా ఉండే మినీ కథలు, పాఠకులని కొంచెమైనా ఆలోచింపచేసే కథలు, హృదయానికి హత్తుకునే కథలు..రావాలని ఆశిద్దాం.

*Writer:*
**K.B.Krishna**
**3-15/2 Gayatri Nilayam**
**Valasapakala**
**Kakinada– 533 005**
**Phone:0884-2358217**
**Cell : 9989102738**

***




**కౌముది పాఠకులకి** డా.మూలా రవికుమార్ పేరు సుపరిచితమే. తెలుగు కథా రచయితల్లో సొంతగొంతుక కలిగిన కొద్ది మంది రచయితల్లో రవికుమార్ గారు ఒకరు. కథా వస్తువుని ఎన్నుకోవడంలోనూ, కథా విస్తరణలోనూ కథ చెప్పే విధానంలోనూ రవికుమార్‌గారి కంటూ ఒక ప్రత్యేకత ఉంది. అది విజయనగరం జిల్లా యాస కావొచ్చు, పల్లెప్రజల అమాయక మనస్తత్వాల చిత్రణ కావొచ్చు, మూగ జీవాల ఆక్రందన కావొచ్చు..ఏదైనా ఈ రచయిత కలంలో ప్రత్యేకమైన రచనగా అందంగా రూపుదిద్దుకుంటాయి. పూర్తిగా కాకపోయినా ఈ కథలు చదువుతుంటే ఒక రావిశాస్త్రిగారో, బీనాదేవిగారో గుర్తొస్తారంటే అతిశయోక్తి లేదు. చింతలవలస అనేది ఉత్తరాంధ్రా ప్రాంతంలోని ఒక కుగ్రామం. చాలా వరకు కథలు ఆ వూరి పరిసరాల్లోనే తారాట్లాడుతుంటాయి. 'బడిశాల', ' దీనాతి దీనార్',' రైల్ వేపాకు' లాంటి కథలు చదువుతుంటే ఒక్కసారి ఆ వూరు వెళ్ళాలనీ,ఏ కల్తీ కల్మషం లేని ఆమనుషుల్తో మాట్లాడలని అనిపిస్తుందంటే అదంతా ఈ రచనల్లోని గొప్పదనమే. పూర్తి సరదా కథలని (రంగుల నీడల్లో) , పూర్తి సీరియస్ కథలని (ఫుడ్ చైన్) ఎంత ఆసక్తికరంగా వ్రాస్తారో, సరదాలో సీరియస్‌ని (దీనాతి దీనార్) కూడా అంత చదివించేలా వ్రాయగల సత్తా ఉన్న రచయిత డా.రవికుమార్‌గారు. చాలా కథలు ఆలోచింపచేస్తాయి, కొన్ని కథలు ఆ వాతావరణంలోకి పాఠకుడిని లాక్కెళ్తాయి, ఇంకొన్ని కథలు తమవైన శైలిలో చివరంటా చదివిస్తాయి. తెలుగుకథల్లో వైవిధ్యభరితమైన, ప్రయోజనకరమైన రచనలగురించి ఎప్పుడు ఎక్కడ మాట్లాడినా రవికుమార్‌గారి ప్రస్తావన తప్పని సరిగా ఉండాలి. ముందుమాటలో ప్రముఖరచయిత ఎల్కక్ష్కాన్ గారుఅన్నమాటలు ' డా.రవికుమార్ తెలుగు కథలను పాలపుంతలోకి తీసుకెళ్ళిన రచయిత. వర్ణనలకు దూరంగా ఉండి వాస్తవాలకు కథ రూపాలనిచ్చి తీరైన క్రమంలో,తనదైన శైలిలో వేగంగా కథల్ని చెప్పడంలో రచయిత కృతకృత్యుడయ్యాడు..' అన్న మాటలు అక్షర సత్యాలు. మంచి కథలు చదవాలనుకున్న పాఠకులకి విందుభోజనమీ 'చింతలవలస కథలు'.

***

**For Copies :**

*Visalandhra Book House*
*Prajasakti Book House*
*Navodaya Book House*
*Disa Pusataka Kendram*
*Navodaya Publishers*

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**